# గదాధరం అండ్ సన్స్!

రాంపా



“ఎలాగోలా మా అబ్బాయిని గట్టెక్కిచ్చి గుట్టెక్కొచ్చానురో...” ఆనందంగా చెప్పాడు గదాధరం.

“చాల్లెండి- ఊరేగింపు ముందు డాన్సులూ మీరూనూ అన్నయ్య గార్ని బయటే నించోబెట్టి మాట్లాడిస్తున్నారు.” మాటల పాశం భర్త మెడకు వేసి లోపలికి లాగింది భార్య ధనం.



‘‘మొత్తానికి మీ వాడు టెంత్ పాసయి ‘లా ఆఫ్ పవరేజస్’ సూత్రం రుజువు చేశాడురా.’’ అన్నాడు మార్తాండతేజం- గదాధరంతో లోపలికి వస్తూ.

“అదేమో గానీరా. ఏ ఏటికాయేడు వాడు పాసవడానికి నేను పడ్డ అగచాట్లు, కొట్టిన కోకోనట్లు కోటానుకోట్లురా.” అన్నాడు గదాధరం.

“చాల్లెండి విడ్డూరం. తిరుపతి వెంకన్నకొచ్చిన కొబ్బరికాయలన్నీ మీరే కొట్టినట్లు చెబుతున్నారు.” తన సహజధోరణిలో అంది ధనం.

“ఏడీ, వాడు- వాడినోట్లో ఓ పూతరేకు వేద్దాం.” అడిగాడు మార్తాండతేజం.

“ఒరేయ్ కిచ్చా! అంకులొచ్చాడు రారా.” ఘనంగా కొడుకుని పిలిచాడు.

“పెద్దోడి పేరు ఘంటసాల. చిన్నోడి పేరు కిషోర్‌కుమార్ అని పెట్టుకుని ఈ కిచ్చా ఏంట్రా?” అర్థంగాక అడిగాడు మార్తాండతేజం.

“మా వారికి ముద్దెక్కువై ఎక్కడికో వెళ్లి పిలుచుకుంటున్న పేరులెండి అన్నయ్య గారూ...” చెప్పింది ధనం.

“కిషోర్ అనీ, కిచ్చోర్ అనీ చివరకి కిచ్చా అయింది లేరా- యింతకీ ఏడీవాడు..”

ఫ్రెండుకి వివరం చెప్పి కొడుకు గురించి భార్యను వాకబు చేశాడు గదాధరం.

“యింట్లో ఎందుకుంటాడండీ- పాంటలూన్ పాంటు, షాపర్‌స్టాప్ షర్టు, బాటా బూట్లు రేబాన్‌గ్లాసులు వేసుకుని

కాళ్లతో రోడ్లు కొలవడానికి వెళ్లాడు.''

టీపాయి మీద టీ పెడుతూ చెప్పింది ధనం.

టక్కున టీ కప్పందుకుని నాలుక్కరుచుకుని వంటి మీద ఓ చుక్క జార్చుకుని కప్పు మీద సాసర్ బోర్లించాడు మార్తాండతేజం.

''అమ్మాయి చిక్కటిపాలతో టీ చేస్తుందని తొందర పడితే ఏమయిందో చూశావుగదరా.'' అన్నాడు.

''నీకంతే కావాలిరా- లేకపోతే మా పెద్దోడికి అయిదేళ్ల జైలు శిక్ష వేయిస్తావా..'' భార్యను చూస్తూ అన్నాడు గదాధరం.

''అదేంటి నన్ను చూసి చెబుతారేం. సినిమాలో వేషం వస్తుందని ఎవరో చెబితే కత్తి పట్టుకుని పోజులు పెట్టి ఫోటోలు దిగాడు. కత్తెందుకిచ్చారు? దానికి రక్తం ఎందుకుంది. అన్న ఆలోచన కూడా లేకుండా...'' చెబుతూ ఆగిపోయింది ధనం.

''అదే ఎవరో చెప్పిన మాట వినబట్టే వాడు చేయని నేరానికి శిక్షపడింది.'' అన్నాడు గదాధరం.

''పక్కవాళ్లని నమ్మి వాళ్లు ఆడమన్నట్లు ఆడే మీ గుణం పిల్లలకొచ్చింది. కొంప ముంచింది. దానికి అన్నయ్య గారేం చేస్తారు?'' కళ్లు తుడుచుకుంటూ అంది.

''నా కొడుకులు వజ్రవైఢూర్యాలోయ్. యిదిగో వీడే. చమటలు పట్టేదాకా పేరుమోస్తున్న క్రిమినల్ లాయరు. మనవాడి

తరపున వాదించకుండా ఎదురువెళ్లాడు.'' అన్నాడు గంగాధరం.

''అరేయ్- వాళ్లు ఫోటోలు తీసింతరువాత పాతి పెట్టిన ఆ కెమెరాను తవ్వి తీయించకపోతే- ఆజన్మ కారాగారమయ్యేది అయిదేళ్లలో పోయింది. ఏది ఎందుకు జరిగిందో కొంచెం ఆలోచించరా- వెధవా.. '' చెప్పాడు మార్తాండతేజం.

''ఆయన మాటలు పట్టించుకోకండి అన్నయ్యగారూ'' అంది ధనం లోపల అలజడిని కనపడనీయకుండా.

గదాధరం నవ్వుతున్నాడు.

''అదేంటమ్మా! ఆ వెధవ సంగతి నీకంటే ముందే నాకు తెలుసుగా. అయినా వాడికి తెలియదా జరిగిందేవిటో.'' అన్నాడు మార్తాండతేజం.

''ఆయనకు తెలిసినప్పుడు ఏది ఎందుకు జరిగిందో ఆలోచించమని ఎందుకు చెప్పారో...'' అమాయకంగా అడిగింది ధనం.

''లాయరుగాడిని లాపాయింటుతో కొట్టావోయ్'' నవ్వుతూ అన్నాడు గదాధరం.

''సర్లేమ్మా- ఆ డైలాగులో 'అరేయ్-వెధవా' అన్న గౌరవాన్ని వాడికే వుంచేసి మిగిలిన సంగతి నీకే చెప్పాననుకో'' క్షణం ఆలోచించి అన్నాడు మార్తాండతేజం.

''భలేగా తప్పించుకున్నావురా నేరాల్లాయరో...'' అన్నాడు గదాధరం

అందరూ నవ్వులాపింతరువాత '' అవున్రా- చిన్నోడికి మోటర్‌సైకిల్ కొనిపెడుతున్నావా..'' గదాధరం భుజం మీద చేయివేసి అడిగాడు మార్తాండతేజం.

''వాడు చదివిన చదువుకు పెట్టింది చాలక అదో ఖర్చా అని అంటున్నారన్నయ్యగారూ'' అంది ధనం.

''పెద్దోడి బండే యస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ ముందు తుప్పు పట్టి సగం భూమిలో యిరుక్కుపోయి వుంది. వీడిక్కొనిపెడితే టాంక్‌బండ్ మీద ట్రిపుల్స్ వెళ్తూ ఏ ఆగివున్న లారీకో కొడతాడని ధైర్యం.'' చెప్పాడు గదాధరం.

''ధైర్యం ఏంట్రా?''

''నా అంచనాలు తప్పుకావనే భయం లేదు కాబట్టి ధైర్యం. అరెరే! నీ పిల్లల్ని చూసి కూడా బుద్ధి రాదేంటిరా వీళ్లకు...''

ఆవేదనగా అన్నాడు గదాధరం.

''మగపిల్లల తరహా వేరుగా వుంటుంది లేరా- సరే వెళ్లొస్తా'' అంటూ లేచాడు మార్తాండతేజం.

''అరేయ్. నల్లకోటేశ్వరుడా. నీ ప్రాక్టీసంతా నా కొడుకుల నేరాలకే అయ్యేట్టుందిరా..'' అన్నాడు నవ్వుతూ గదాధరం.

''ఇక చాల్లే- నేరాలు ఘోరాలు వుంటేనే కదరా లాయర్లు కోర్టులు బతికేది.'' అన్నాడు మార్తాండతేజం.

''పేపర్లు, టీవీలను కూడా ఆ జాబితాలో కలపరో..'' అన్నాడు గదాధరం గేటుదాకి వెళ్తూ.

***

''అరేయ్ కిచ్చా- ఏం గెటప్పిచ్చావురా..'' ఎత్తుకుని దింపి అన్నాడు కిషోర్ ఫ్రెండు జలచరం. మానాన్న ఈ మధ్య ముద్దు పిలుపు వీడికెట్టా తెలిసింది అన్నట్లు చూశాడు కిషోర్.

''అరేయ్ మీ నాన్న సముద్రాల్లో పనిచేస్తూ భలే పేరు పెట్టి చచ్చాడురా నీకు..'' అన్నాడు కిషోర్.

''అదేంటోరా నాకు నీళ్లంటే చచ్చే భయం.'' చెప్పాడు జలచరం.

''ఆ భయమే నీకు లేకపోతే సబ్‌మెరేన్ లేకుండానే నీవు సముద్రంలో దూకి రత్నాలు దొంగతనం చేసే వాడివి...'' అన్నాడు కిషోర్.

''అరేయ్ నేను చోటా మోటా దొంగతనాలు చేసేది పాకెట్ మనీ గురించే కదరా. నీకంటే మీనాన్నున్నాడు అడిగినంత డబ్బివ్వడానికి.'' వెంటనే అన్నాడు జలచరం.

''లేదురా ఈ మధ్య పూర్తిగా టైట్ చేశాడు. చదువో చదువో అని వెంట

పడుతున్నాడు.'' అన్నాడు దిగులుగా కిషోర్.

''ఎంతకాలం అంటాడురా. అయినా చదువుసాధించావు గదరా..''

చిలిపిగా చూస్తూ అన్నాడు జలచరం.

''డిగ్రీ కావాలంటున్నాడురా...'' దిగులు మొహానికి ఏడుపు రంగు అద్ది అన్నాడు కిషోర్.

''ఎందుకు నాలుగ్గీసుకోడానికా. నాతో కలువు హాయిగా తోడు దొంగల్లాగా ఎదుగుదాం..'' అన్నాడు జలచరం కిషోర్ మొహాన్నే చూస్తూ.

''వామ్మో. దొంగతనానికి నేను దూరంరో...'' అన్నాడు కిషోర్.

''పోన్లే దొంగకి దగ్గరేగా..'' అన్నాడు జలచరం.

''కాదురా.'' అన్నాడు కిషోర్ గాలిలోకి చూస్తూ. ''నీతో కనిపిస్తే కాళ్లిరగ్గొడతానన్నాడురా మా నాన్న.'' అని ముగించాడు.

''నాన్న మాటను కాదని వచ్చావంటే నీ అంత మంచివాడు లేనట్టేరా- రారా ఉడిపి హోటల్లో కడుపు తడిపి వద్దాం.'' ఆనందంగా కిషోర్ భుజం మీద చేయి వేసి హోటల్కి తీసికెళ్లాడు జలచరం. హోటల్లో తమకిష్టమైన మూలసీట్లో కూచున్నారు. నోరూరిన టిఫిన్లు తిన్నారు.

''నీ నడక అద్భుతంరా. నువు నడుస్తుంటే నీ చేతులు కూడా బలే స్టయిల్‌గా కదులుతాయిరా.'' అని పొగిడి కిషోర్‌ని

మెలికలు తిప్పాడు.

తనకీ మధ్య ఓ గొప్ప ఫ్రెండు పరిచయమయ్యాడని- వాళ్ల కారు, బంగ్లా, కుక్కపిల్ల సంగతి చెప్పి ''నీవెప్పటినుంచో అడుగుతున్నావుగా డాల్మేషన్‌ని పెంచుకుంటానని- యిప్పిస్తానురా.'' అన్నాడు జలచరం.

గంతులేసుకుంటూ వెళ్లాడు కిషోర్!

***

''అరేయ్- మార్తాండం! చిన్నోణ్ని జైల్లో పెట్టారురా. నువ్వే విడిపించాలి'' గాభరాగా అన్నాడు గదా



ధరం.

''ఏమయిందిరా.'' అడిగాడు మార్తాండతేజం.

''వీడో జులాయి వెధవ వెంట ఓ యింటికి వెళ్లాడు. అక్కడ వాడు వీణ్ణి బయట సోఫాలో కూచో బెట్టాడు. వీడు పెదరాయుడు పోజులో యింగ్లీషు పేపరు చదువుతూ కూచున్నాడు.'' చెబుతున్నాడు గదాధరం.

''వీడు యింగ్లీషు పేపరు కూడా చదువుతాడా...'' మధ్యలో అడిగాడు మార్తాండతేజం.

''ఆ- వాడి మొహం- తలకిందుల పెట్టి చూస్తుంటాడు..'' అని చెప్పి

''ఈ లోపులో వాడు లోపలికెళ్లి వీడో పెద్ద ఫారెస్టాఫీసరనీ చెప్పి... వాళ్లాయన యింటి కట్టుబడి కోసం కలప తెస్తుంటే

పట్టుబడ్డాడని- అయిదువేలు కడితేనే వదుల్తారని.. ఏవో మాటలతో భయపెట్టి డబ్బులు తీసుకుని వీణ్ణక్కడ వదిలిపెట్టి పారిపోయాడట...'' అని జరిగింది చెప్పాడు గదాధరం.

''అర్థమయిందిలే కేసు. పోలీసులేమన్నా చేయి చేసుకున్నారా..''

''వీడి పేరడిగితే కిషోర్‌కుమార్ అని ఘనంగా చెప్తాడుగా! చెప్పాడు. వాళ్లకు తెలుగు అర్థమయిందో లేదో కి-చోర్-కో-మార్ అని కొట్టారుట...''

''ఏమంటున్నాడు మీవాడు..''

''దెబ్బలు తింటే తిన్నా ,అన్నయ్యతో మాట్లాడా అని సంతోషపడుతున్నాడు...''

''బాగానే వుంది- యిదో ఖర్చు తగులుకుందన్న మాట..'' అన్నాడు మార్తాండతేజం.

***

''ఆ జలచరం గాడితో తిరగొద్దని నాన్నగట్టిగా చెప్పాడు గదరా...'' అంది ధనం కొడుకు వీపు నిమురుతూ.

''చిన్నప్పుడు మనింట్లో నేను వాడూ గోలీలాడుకున్నాం గదే. వాడి చలాకీతనం నీక్కూడా యిష్టం వుండేది కదే...'' అన్నాడు కిషోర్.

''చిన్నప్పుడు ఎవరి మాటలైనా ఆటలైనా ముద్దొస్తాయిరా...పెద్దయి పెద్ద టెర్రరిస్టయినవాడు కూడా చిన్నప్పుడు ముద్దుగానే వుంటాడే.'' కొడుకు సమర్థనకు మరో అవకాశం లేకుండా చెప్పింది ధనం.

''ఇక వాడిపని అంతేనంటావా..'' అడిగాడు కిషోర్.

''వాడితో తిరిగితే నీపని కూడా అంతే. బుద్ధిగా చదువుకో. చండామార్కులవంటి ఏకంగా యిద్దరు ట్యూషన్ మాస్టర్లను పెట్టించారు మీ నాన్న. యిక నీకు యింట్లోనే చదువు..'' అంది ధనం.

''ఈ చందామార్కులు ఎవరే..''

''ప్రహ్లాదుడికి చిన్నప్పుడు చదువు చెప్పిన రాక్షసులు...'' అంది ధనం.

''ఓ అయితే యింకేం వాళ్లు చెప్పింది నాకు రాదు. నీకు వచ్చింది వాళ్లకు పోదు..'' అన్నాడు కిషోర్.

''పేర్లు మరచిపోయావుగాని చిన్నప్పుడు చెప్పిన కథ బాగానే

గుర్తుందిరా..'' అంది ధనం.

''అదేంటోనమ్మా నువు చెబితే గుర్తున్నట్లుగా టీచర్లు చెబితే వుండదేంటే...'' అమాయకంగా అడిగాడు కిషోర్.

''అదంతేరా నీకిది యింతేరా'' అంది ధనం.

''అంతే- అన్నయ్యకు జైలు శిక్షా, నాయిల్లు నాకు శిక్షా

తప్పదన్నమాట..''అన్నాడు కిషోర్.

***

కిందపోర్షన్ కి రాయికిచ్చారు. వాళ్లిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. పిల్ల ల్లేరు. భార్యాభర్తలిద్దరూ సరదా జంట. పైనుంచి కిందకి రావాలంటే వెనక నుంచి ముందునుంచి వున్న మెట్లే. వెనక మెట్ల తలుపుకు తాళం వేస్తే ముందునుంచొకటే దారి. యింట్లో స్కూలయింది కిషోర్‌కి- నాన్న నాకు బాగా కట్టుదిట్టం చేశాడు అని ఆలోచిస్తూ తల్లినడిగాడు..'' అమ్మా నేను బయట గాలి పీల్చొద్దానే'' అని.

''నీకా జలచరం గాడి గాలి తగలొద్దని నాన్న ఉద్దేశం..'' చెప్పింది ధనం.

ఆలోచనే మిగిలింది కిషోర్‌కి. కిచ్చా నీకిదేమి చిచ్చా అని గాలి పలకరిస్తోంది కిషోర్‌ని.

***

''మళ్లీ ఏమయిందిరా.'' అడిగాడు మార్తాండ తేజం.

''ఏముంది కిందపోర్షన్ వాళ్లు వెళ్లేటప్పుడు వేసిన తాళం సాయంత్రం వచ్చినప్పుడు తీయడమే. వేసిన తాళం వేసినట్లే వుంటుంది బీరువాలో డబ్బులు మాయమవుతున్నాయి.'' చెప్పాడు గదాధరం.

''వాళ్లు నీకు చెప్పారా'' అడిగాడు మార్తాండ తేజం.

''నాకేగా చెప్పాల్సింది. పాపం ఆ భార్య భర్తలిద్దరూ ఒకళ్ల మీద ఒకళ్లు అనుమానపడే పరిస్థితి వచ్చింది. నాకూ ఏం తోచలేదు. నాపన్లు నాకున్నాయి. నేను మాత్రం ఎన్నిరోజులు కాపలా కాస్తాను. ఈ గొడవ విని టీచర్లు భయపడి యింటికి రావడం మానేశారు.''

''మరేం చేశారు వాళ్లు..''

''ఆయన బాక్సర్ బావమరిదిని ఊళ్లోంచి పిలిపించి యింట్లో పెట్టి తాళం వేసి వెళ్లడం మొదలుపెట్టారు. రెండు రోజుల్లో దొంగలు పట్టుబడ్డారు.''

''బావుందే అయిడియా..''

''బాగానే వుంది. పట్లుబడ్డది ఆ జలచరంగాడి వెనక మా కిచ్చాగాడు. ఆ పోర్షన్‌వాళ్లు తనకెక్కడో దూరపు బంధువులని ఏవో మాటలు చెప్పితే వీడితోపాటు వాణ్ణి ఒక రోజు ఆంటీ ఆంటీ టీ అనుకుంటూ తీసికెళ్లాడట అంతే, యింటికీ, బీరువా కీ లకి డూప్లికేట్లు తయారయ్యాయి. అవసరం వచ్చినప్పుడల్లా పాకెట్‌మనీ తీసుకెళ్తున్నాడు.'' చెప్పాడు గదాధరం.

''పట్టుబడ్డప్పుడు వీడెందుకున్నాడు.'' అడిగాడు మార్తాండతేజం.

''కరిమింగిన వెలగపండులాగా డబ్బులు పోవడం- అలజడి విన్నాడుగా. వీడికెందుకో అనుమానం వచ్చి నిఘా వేశాడు. వాడు తాళం తీసి లోపలికి వెళ్తుంటే వాడికి తెలియకుండా వీడు లోపలికి వెళ్లాడు. ఆ బావమరిది యిద్దరికీ రెండు పంచ్‌లిచ్చి చంకల్లో బిగించి పోలీసులకి అప్పగించాడు.'' చెప్పాడు గదాధరం.

''మీవాడేమంటాడు...''

''ఏమంటాడు మళ్లీ అన్నయ్యతో మాట్లాడే అవకాశం దొరికింది

అన్నాడు.'' చెప్పాడు గదాధరం.

''సరే ఏం చేస్తాం. మార్తాండ 'తేజం' చూపిస్తా'' ఛాలెంజింగ్‌గా అన్నాడు మార్తాండతేజం.

''భూమ్మీద తిరుగుతున్న ఆ జలచరం గాడి సంగతి కూడా చూడరా..'' వేడుకున్నాడు గదాధరం.

***

''అరేయ్ గదా! ఎప్పుడులేంది నీ సలహా నేను విన్నానురా. మీ వాణ్ణి మీ యింటికి పంపించి ఆ జలచరం గాణ్ణి మా యింటికి తీసికెళ్లా. కౌన్సిలింగ్ చేసి పారేశాను. మాటలతో ఎంత మార్పు వస్తుందో వాడి మొహం చూస్తే తెలిసిందిరా.''

''క్రిమినల్ లాయర్‌వి సివిల్ పని చేశావన్నమాట.'' అన్నాడు గదాధరం.

''నేను సరిగ్గా వాడితో మాట్లాడుతున్నపుడే ఆబిడ్స్ నుంచి వాళ్ల కేసు వాయిదా గురించి బంగారు నగల షాపువాళ్లు వచ్చెళ్లారు. సరే వాళ్లకేదో చెప్పి పంపించా...''

''మరి వీణ్ణేం చేశావు?'' అడిగాడు గదాధరం.

''స్కూలుకు తీసికెళ్లి ఫీజుకట్టి పుస్తకాలు కొనిపెట్టి హాస్టల్లో చేర్పించి

వచ్చా..''

''హమ్మయ్య- ఒక మంచిపని చేశావన్నమాట.'' శ్వాసపీల్చి అన్నాడు గదాధరం.

''నువ్వన్నట్లే నేనూ అనుకున్నా- కానీ ఆ జలాచరం గాడు స్కూల్ బేగ్‌లో బంగారు నగలు వేసుకుని మాయమయ్యాడు. సరే పట్టుకున్నాం అనుకో.''

''పట్టుకోవడం కాదు. ఏ కీలుకాకీలు వూడదీసి చుట్టుపక్కల జైళ్లలో పెట్టించాలి. ఒకే చోట పెడితే జరాసంధుడి కాళ్లలాగా

అతుక్కుపోతాయి.'' అన్నాడు గదాధరం కొంత ఆవేదనతో,.

''వాణ్ణి కొట్టీకొట్టీ పోలీసులు విసిగిపోయారట.''

''ఏదైతే ఏంలే. జైల్లో పడేయించావు చాలు.'' అన్నాడు గదాధరం.

''అయితే అక్కడ కూడా వీడి కళాప్రదర్శన చేశాడు. జైలర్ శాలరీ మాయం చేశాడట. పోలీసులు వాణ్ణి జైల్లో పెట్టడం కొట్టడం మానేసి వాడి లీలలు రికార్డు చేసి పుస్తకంగా తెద్దామనుకుంటున్నారు.''

''అదేంటి'' ఆశ్చర్యంగా అడిగాడు గదాధరం.

''దొంగతెలివైనా- తెలివి తెలివే కదా. గౌరవించాలి గదా.''

''నువ్వే యిట్లా మాట్లాడడం ఏం బావుండలేదురా.'' అన్నాడు గదాధరం.

''సరదాకన్నానుగాని...నిజంగా ఏం జరిగిందంటే వాడికో చిన్నసైజు కుతుబ్‌మినార్ కట్టించి వాణ్ణి పైన పడేసి, కింద పోలీసులు కాపలావుంటున్నారు.''

''అక్కడి నుంచి వాడు ఏ హెలికాప్టర్ లాడరో పట్టుకుని ఎగిరిపోగలడు జాగ్రత్త.'' అన్నాడు గదాధరం నవ్వుతూ.

''ఆ మాట నేను పోలీసులతో అంటే- ఆపనే

వాడు చేస్తే తీసికెళ్లి గోదావరి పాపికొండల సుడి గుండాల్లో వదిలిపెడతామన్నారు.'' చెప్పాడు మార్తాండతేజం నవ్వుతూ.

***

పెద్దవాడు జైల్లో వుండే చదువుకుని డిగ్రీ అందుకుని శిక్ష పూర్తి చేసుకుని యింటికి వచ్చాడు. గురువుల పుణ్యమా అని చిన్నవాడు కూడా డిగ్రీ అయిందని పించుకున్నాడు.

మార్తాండతేజం వచ్చాడు.

''ఆ ఊళ్లో అందరూ ఆరోగ్యంగా వుంటే డాక్టరు బక్కచిక్కి పేషంటయ్యాట్ట. అందరూ సామరస్యంతో సంతోషంగా వుంటే లాయరు లాకప్పులోకి వెళ్లాట్ట- అన్నట్లు నీ కొడుకులేంటిరా బుద్ధిమంతులై నాకు ప్రాక్టీసు లేకుండా చేశారు.'' అన్నాడు నవ్వుతూ.

''ఆ వెధవలు బలవంతంగా బుద్ధిమంతులయ్యారు. 'గదాధరం అండ్ సన్స్' అని వ్యాపారం పెడితే విసిరేసే ధరలకు వస్తువులు అమ్మాల్సి వచ్చింది. మహాగాయకుల పేర్లు పెడితే వ్యాపారంలో వేలం పాటలు పాడారు. కొంత సునామీకి, భూకంపానికి యిచ్చి కంపెనీ ఎత్తేసి బోర్డు మాత్రంతోకూడిన బల్లిలా యింటి ముందు గోడకు వేలాడదీశారు.'' చెప్పాడు గదాధరం గుక్క తిప్పుకోకుండా.

''అంతా మనమంచికే అనుకుందాంలేరా...'' అన్నాడు మార్తాండతేజం.

''అనుకుందాంలే గాని, పదివేలు అర్జంటుగా కావాలని ఫోన్ చేసి రాలేదేంరా..'' అడిగాడు గదాధరం.

''పిల్లల యింటర్వ్యూలకేదో అవసరమొచ్చి మా పక్కవాళ్ల నడిగి సర్దేశాలే..'' చెప్పాడు మార్తాండతేజం.

''చాలా తెలివిగల్ల పని చేశావులే. ఈ యిరవై తీసికెళ్లి ఆ సర్దేసిన వాళ్లకి సర్దేసి మిగిలింది పిల్లలకిచ్చేయి నీ చినిగిన జేబులో వేసుకునేవు.'' అని నవ్వుతూ స్నేహితుడిని దగ్గరకు తీసుకున్నాడు గదాధరం.

***

''ఏవండీ పిల్లలు పెద్దవాళ్లయ్యారు. యింకో రెండు రోజులైతే పూర్తిగా ముదిరిపోతారు కూడా. ఏదో వాళ్లకి తోడు కుదిరించి ఓ యింటి వాళ్లని చేసి మనం కాశీ ప్రయాగలు చూసొద్దామండీ..'' అంది ధనం లాలనగా.

''యింట్లో కూచున్నవాళ్లని యింటి వాళ్లను చేయడమేంటి. ఆ వెధవల్ని చేసుకోడానికి విధవలు కూడా ముందుకు రారు.'' అన్నాడు గదాధరం.

''శుభం మాట్లాడండీ అంటే కన్నతండ్రే యిలాంటి దీవెనలిస్తే ఎలా చెప్పండి.'' అంది ధనం పెళ్లి సంగతి తేలాలి అన్న నిశ్చయంతో.

''లేకపోతే సుచిత్రాసేన్ ఐశ్వర్యారాయ్‌లను అడిగిరమ్మంటావా..'' అన్నాడు విరుపుగా గదాధరం.

''మరీ అంత విరగ్గొట్టుకుని మాట్లాడకండి.'' అంది ధనం.

''నేనంత విసిగిపోయా-నువ్వే ఆ ఏర్పాటు ఏదో చేసేస్తే బౌండరీ లైన్ మీద నించుని నాలుగు అక్షింతలు విసిరేస్తా.'' అన్నాడు గదాధరం.

కాస్తంత మొగ్గు చూపాడన్న ఆనందంతో-

''ఏమండీ. మీ ఫ్రెండు పేరుకు క్రిమినల్ లాయరే గాని సంపాదించింది అంతగా లేదు. ఆయన యిద్దరి కూతుళ్లను మన కోడళ్లుగా చేసుకుంటే ఎలా వుంటుందంటారు?'' కోరికను బయటపెట్టింది ధనం.

''ఆ ఊహ నీకు వచ్చినందుకు నేను క్రిమినల్‌నైపోతా- ఆ మార్తాండం గాడితోనే నామీద కేసు పెట్టించాల్సి వస్తుంది నీకు.'' అన్నాడు గదాధరం.

''ఏంట్రా మొగుడూ పెళ్లాలు ఏదో పెద్ద ఎత్తున గొడవ పడుతున్నారు.'' అంటూ వచ్చాడు మార్తాండతేజం.

''ఆ- ఏంలేదురా ఆవకాయకారంలో చింతకాయ తక్కువైతే కాస్త పంచదార కలుపుతానంటుంటే ఏం బావుంటుందని కొంచెం గట్టిగా అంటున్నాలే. '' అన్నాడు గదాధరం మొహం అటు యిటూ పెడుతూ.

''అరేయ్ గదను ఎత్తలేని గదాధరంగా నేనంతా విన్నానురా. నా కూతుళ్లు నీ కోడళ్లు కావడం సంతోషంగా ఒప్పుకుంటా.'' చెప్పాడు మార్తాండతేజం.

''అరేయ్- పెరిగిన ఆడపిల్లల్తో ఎందుకురా దెబ్బలు తినాలని చూస్తావు?''అన్నాడు గదాధరం.

''లేదులేరా. వాళ్లతో మాట్లాడే నీ దగ్గరికొచ్చాను.'' అన్నాడు మార్తాండతేజం.

''తీయివోయ్ పూతరేకులు.'' అన్నాడు ఆనందంగా గదాధరం.

అరేయ్- నీకు దండం పెడతా మా సంబంధం నీవెలా ఒప్పుకున్నావో చెప్పరా.'' అన్నాడు గదాధరం.

''నిజం చెప్పనా! పక్కవాళ్లను నమ్మి వాళ్ల వాళ్ల మాటలకు లొంగిపోయే నీ గుణం నీ పిల్లల్లో వుంది చూశావు- ఆ పక్కవాళ్లే నా పిల్లలెందుకు కాకూడదని పించిందిరా.'' చెప్పాడు నవ్వుతూ మార్తాండతేజం.

''ఓరి వెధవా! ఎంత కుట్ర పన్నావురా నా కొడుకుల్ని యిల్లరికపు అల్లుళ్లుగా మార్చుకుందామనే.'' ఆనందంగా స్నేహితుణ్ణి ఎత్తుకున్నాడు. గదాధరం.

''ఆగండాగండి- మీ స్నేహానికి చీమలు పడతాయి.'' అంది నవ్వుతూ వచ్చిన ధనం.

''అయితే మన పిల్లల పిల్లలకి పేర్లు మాత్రం నేనే పెడతా.'' అన్నాడు మార్తాండతేజం.

''నాదో చిన్న విన్నపంరా- నువ్వే పెట్టు కానీ స్కానింగులేవో చేసి ఆడో మగో చెప్పినట్లుగానే డియన్ ఎలు, జీన్స్ టెస్టులు ఏమన్నా వున్నాయో కనుక్కో.'' అన్నాడు గదాధరం.

''దేనికిరా?'' అడిగాడు మార్తాండతేజం.

''పెద్దయి.. ఏ బుద్ధులొస్తాయో ముందే తెలుసుకుని ఆ బుద్ధికి తగ్గపేర్లు పెడదామని.'' అన్నాడు గదాధరం నవ్వుతూ. '' ఏదెలా వున్నా నా కోడళ్లు తీయటి గొంతున్న గాయనీమణులు నా జీవితానికది చాలురా.'' మళ్లీ అన్నాడు గదాధరం.

''సరే. ముందెళ్లి నీ చెవిటి మెషీన్ రిపేర్ చేయించుకురా.'' నవ్వుతూ అన్నాడు మార్తాండతేజం.

''అది బాగానే వుందిరా. అమ్మాయిలూ నాకు ముందుగా- భాగస్తులు సినిమాలో కీర్తిశేషులు యస్.పీ.కోదండపాణిగారి మధురాతిమధుర సంగీతంలో వాణీ జయరాం పాడిన పాట కావాలి.'' ఆప్యాయంగా అడిగాడు గదాధరం. కోడళ్లు గొంతువిప్పారు.

''నవ్వూ- నవ్వించూ- నవ్వలేని వారికి నీ నవ్వులు పంచూ....''

అందరూ ఆనందంగా వింటున్నారు ఆ పాటని.

